సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 21 । నవంబర్ । 2024



అబ్బే అంతా తూచ్..!

మత్స్యకారులకు కూటమి సర్కార్ మొండిచేయి చూపుతోంది. ఇంతవరకు వేట నిషేధ భృతి అందజేయలేదు.

- 8లో



కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు

శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ వెనుకనున్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 25న కోటి దీపోత్సవం నిర్వహించనున్నారు.

- 8లో

నేడు రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ అండర్-12 బాల బాలికల జిల్లా జట్లు ఎంపికలు గురువారం నిర్వహిస్తున్నట్లు రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డొంకాన రామకృష్ణ, బొన్నాడ పార్వతీశం, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 8500007272, 7842423423 నంబర్లను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

తనిఖీలు ముమ్మరం



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి. చిత్రంలో డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం: ఆంధ్ర- ఒడిశా సరిహద్దు ప్రాంతం గుండా నిషేధిత పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసులకు ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గంజాయి నియంత్రణకు సంకల్పం పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పురుషోత్తపురం చెక్‌పోస్టును పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. కార్యక్రమంలో కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్సై చిన్నంనాయుడు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షిద్దాం



ర్యాలీలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేద్దామని మహిళా, శిశు సంక్షేమ సాధికారత జిల్లా అధికారి బి.శాంతిశ్రీ అన్నారు. బుధవారం బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి సూర్యమహల్ కూడలి వరకు బాల, బాలికలు చేపట్టిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 14న బాలల దినోత్సవం, 20న అంతర్జాతీయ బాలల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద మాట్లాడుతూ మానవ హక్కులు, బాలల హక్కుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ కె.చెన్నకేశవరావు, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

దారి దోపిడీకి సిద్ధం


- పల్లె రహదారుల్లో యూజర్ చార్జీల బాదుడు
- టోల్‌గేట్ల మాదిరిగా గ్రామీణ రోడ్లపైనా వసూలు
- ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ అప్పగింత
- జిల్లాలో మూడు రాష్ట్ర హైవేల్లో కొత్తగా టోల్‌ప్లాజాలు
- గుంతలు పూడ్చడానికి తప్పదంటున్న సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

సంపద సృష్టిస్తా.. అని ఎన్నికల్లో చంద్రబాబు చెబుతుంటే ప్రజలు నమ్మారు. ఆయన దగ్గర ప్రత్యేక ప్లాన్లు ఉన్నాయేమో అని అనుకున్నారు. తనకున్న అనుభవంతో సంపద సృష్టిస్తారేమో అని భావించారు. కానీ, రోజుల గడుస్తున్న కొద్దీ జనాలకు అర్థమవుతోంది. చంద్రబాబు సంపద సృష్టించడమంటే ప్రజలపై భారం మోపడమని.. తన దగ్గర ప్రత్యేక మంత్రదండం లేదని, ప్రజల నుంచి వసూలు చేసి, ఖర్చు పెట్టడమే సంపద సృష్టి అని అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచనని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పి ట్రూ అప్, సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచేశారు. ఇప్పుడు రోడ్లు అభివృద్ధి చేయాలంటే యూజర్ చార్జీలు వసూలు చేయకతప్పదని చంద్రబాబు తన మనసులో మాట తాజాగా బయటపెట్టేశారు.

పీపీపీ మోడల్ పేరిట బాదుడు..

రోడ్లు అభివృద్ధి చేయడానికి నిధుల్లేవని చెప్పి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) మోడల్‌ను ప్రోత్సహిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు రోడ్ల అభివృద్ధిని అప్పగించి, వారికే ఆ రోడ్లపై యూజర్ చార్జీల రూపంలో టోల్ వసూలు చేసే బాధ్యతను కట్టబెడుతున్నారు. అంటే, ఇప్పటివరకు జాతీయ రహదారులపైన ఉంటే టోల్‌ప్లాజాలు పల్లె రోడ్లపై కూడా ఏర్పాటు కానున్నాయి. ఇక, ఆ రోడ్ల మీదుగా వెళ్లే ప్రతీ ఒక్కరూ టోల్ కట్టాల్సిందే. గ్రామాల నుంచి గ్రామాలకు వెళ్లాలన్నా చెల్లింపు తప్పనిసరి కానుంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో రోడ్లు భవనాల శాఖ పరిధిలో 27 రహదారులను గుర్తించి.. ఆయా రోడ్లను ప్రైవేటు భాగస్వామ్యంతో మరమ్మతులు, అభివృద్ధి చేస్తూ.. ఆయా రహదారుల్లో కొత్తగా టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తున్నారు. అందులో మన జిల్లాకు సంబంధించి మూడు రహదారులు ఉన్నాయి.



ప్రతిపాదిత చిలకపాలెం-రామభద్రపురం స్టేట్ హైవే

గతమంతా దుష్ప్రచారం..

ప్రతిపక్షంలో ఉన్నంతకాలం ఎక్కడా రోడ్లు బాగోలేవంటూ ఊదరగొట్టిన చంద్రబాబు అండ్‌కో ఇప్పుడవే రోడ్లు చూపించి, వాటిని అభివృద్ధి చేయాలంటూ ప్రజల జేబులకు చిల్లులు పెట్టేందుకు అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో రోడ్లు వేయకుండా ప్రైవేటు వ్యక్తులకు బాధ్యతలు అప్పగించి, వారికే టోల్ వసూలు చేసే అధికారం కట్టబెడితే కచ్చితంగా లక్షలాది మందిపై టోల్ భారం పడుతుంది. ఈ టోల్‌ప్లాజాల్లో కార్లు, జీపులతో పాటు ఆర్టీసీ బస్సుల నుంచి కూడా టోల్ వసూళ్లు చేస్తారు. ఇప్పటికే నాలుగు చక్రాల వాహనాల్లో కార్లకు రూ.150 వరకు, లారీలకు రూ.250, బస్సులకు కూడా ప్రత్యేక రేట్లతో వివిధ టోల్ ప్లాజాల వద్ద వసూలు చేస్తున్నారు. ఇదే విధానంతో కొత్త టోల్ వసూళ్ల బాధ్యతలు ప్రైవేటు వ్యక్తుల చేతికి వెళ్లనున్నాయి. ఇదే జరిగితే దారి దోపిడీ తప్పదు. అంతేకాకుండా రవాణా చార్జీలపై కూడా ప్రభావం పడనుంది. ఆర్టీసీ చార్జీలు, రవాణా (కార్గో) చార్జీలను పెంచేందుకు అవకాశం ఉంటుంది.



టోల్ ప్లాజా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనల్లో ఉన్న కళింగపట్నం- శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్డు



పీపీపీ మోడల్ కింద యూజర్ చార్జీలు వసూలు చేసే ప్రతిపాదిత అలికాం-బత్తిలి రోడ్డు

- జిల్లాలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్16), నరసన్నపేట-పర్లాఖిమిడి (ఎన్‌హెచ్ 326ఎ)జాతీయ రహదారుల్లో ఇప్పటికే టోల్‌ప్లాజాలు నడుస్తున్నాయి.
- అంతరాష్ట్ర సర్వీసులు వెళ్లే ప్రధాన సరిహద్దు మార్గాలు కావడంతో ఇక్కడ రహదారుల విస్తరణ నేపథ్యంలో టోల్ వసూళ్లు కొన్నేళ్ల నుంచి జరుగుతున్నాయి.
- అయితే ఎన్నడూ లేని విధంగా పొరుగు జిల్లాల సరిహద్దు ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని మూడు రాష్ట్ర రహదారుల్లో కూడా టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

మూడుచోట్ల కొత్త టోల్ ప్లాజాలు..

- జిల్లాలో చిలకపాలెం-రాజాం-రామభద్రపురం (130.20 కి.మీ) రోడ్డు, కళింగపట్నం-శ్రీకాకుళం - పార్వతీపురం (సీఎస్‌పీ రోడ్డు 113.30 కి.మీ) రోడ్డు, గార-అలికాం- బత్తిలి (84.80 కి.మీ) రోడ్లను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చి యూజర్ చార్జీలను వసూలు చేయనుంది. వాస్తవానికి ఈ మూడు రోడ్ల పరిధిలో వందలాది గ్రామాలు, పదుల సంఖ్యలో పట్టణ ప్రాంతాలున్నాయి.
- గతంలో విశాఖపట్నం, ఇచ్ఛాపురం, పర్లాఖిమిడి వెళ్తేనే టోల్ బాదుడుండేది.. ఇప్పుడు జిల్లాలో సరిహద్దు ప్రాంతాలకు వెళ్లాలన్నా.. రాజాం, పాలకొండ, గార, కళింగపట్నం, హిరమండలం, కొత్తూరు, బత్తిలి తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా టోల్ బాదుడు తప్పదు.

అడిషనల్ కమాండెంట్ డీఎస్పీగా నాగేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా అడిషనల్ కమాండెంట్ ఫస్ట్ బెటాలియన్ డీఎస్పీగా జి.నాగేశ్వరరెడ్డిని నియమిస్తూ బుధవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈయన ప్రస్తుతం వెయిటింగ్ డీఎస్పీగా కొనసాగుతున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆహారం, తాగునీరు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో 'ఎస్.ఆర్.ఎల్.ఎం - ఆహారం, పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత' అనే అంశంపై గ్రామీణ నీటి సరఫరా శాఖ, డీఆర్‌డీఏలు సంయుక్తంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఆరుబయట మల, మూత్ర విసర్జన మానుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ధనలక్ష్మి, టి.పార్వతి, బి.మల్లేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది డి.దాలినాయుడు, ఎస్.మురళీమోహన్, అమ్మాజీరావు, ఏరియా కో-ఆర్డినేటర్లు, ఏపీడీలు, సీసీలు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సుల్లో ఉచిత శిక్షణ



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ శిక్షణ కేంద్రంలో వృత్తి విద్య కోర్సులు టైలరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీలో 30 రోజుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసుగల మహిళలు అర్హులని తెలిపారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 2 నుంచి కోర్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 79933 40407, 95534 10809 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కదం తొక్కిన వీఓఏలు

- యాప్‌ల భారం తగ్గించి.. రాజకీయ వేధింపులు ఆపాలంటూ ధర్నా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో గ్రామస్థాయిలో మహిళా సంఘాల బలోపేతానికి పనిచేస్తున్న గ్రామ సంఘం సహాయకులు (వీఓఏ-సీఏఫ్)లు సమస్యల పరిష్కారం కోరుతూ కదం తొక్కారు. కూటమి ప్రభుత్వం వచ్చాకర పనిభారం, రాజకీయ వేధింపులు, గౌరవ వేతనాల విడుదలలో జాప్యం, పాత జీవోలు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేయడం వంటి విధానాలు అనుసరిస్తున్న సర్కారుపై ధ్వజమెత్తారు. ఈ మేరకు సీఐటీయూతో కలిసి వీఓఏ సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ వెలుగు వీఓఏల ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడులు మాట్లాడుతూ వెలుగు వీఓఏలకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదునెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఇటీవల రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సర్క్యులర్‌ను అమలు చేసేందుకు, రాజకీయ కక్ష సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. యాప్‌ల భారం పెంచుతున్నారని వాపోయారు. అనంతరం కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు.

ఒక వీధి.. రెండు రాష్ట్రాలు



కొత్తూరు మండలం కౌసల్యాపురంలో ఎస్సీ వీధికి ఓ ప్రత్యేకత ఉంది. వీధి కుడి వైపున ఉన్న ఇళ్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవి కాగా.. ఎడమ వైపున ఉన్న ఇళ్లు ఒడిశా రాష్ట్రం హద్దుబంగి గ్రామానికి చెందినవి. ఒకే వీధిలో రెండు రాష్ట్రాల ప్రజలు ఐకమత్యంగా మెలగడం విశేషం.

- కొత్తూరు



గంజాయి అక్రమ రవాణాలో..

తగ్గేదేలే..!

- ఒడిశాలో సాగు.. జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు తరలింపు
- ఈ క్రమంలోనే మత్తుకు బానిసలుగా మారుతున్న జిల్లా యువత

శ్రీకాకుళం క్రైమ్:

జిల్లాలో గంజాయి సాగు లేకపోయినా క్రయవిక్రయాలకు, అక్రమ రవాణాకు మాత్రం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎదురుగా పోలీసులున్నా సరే.. వారిని దాటించి తప్పించుకుపోవడమో.. లేదంటే వారి వాహనాన్ని ఢీకొట్టి పరారు కావడమో వంటి ఘటనలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తమ కాలేజీ గ్రౌండ్‌లో పాడుబడిన వసతిగృహ భవనంలో యువత గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని, దృష్టి పెట్టండంటూ ఓ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఇటీవల ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. శాంతి భద్రతల విషయంలో తలనొప్పిగా ఉన్న కాశీబుగ్గ డివిజన్ కేంద్రంలో ఇద్దరు బాలికలపై మత్తులో ఉన్న యువకులు లైంగిక దాడికి పాల్పడటం విదితమే. జిల్లా కేంద్రంలో ఇటీవల పదుల సంఖ్యలో మత్తుకు బానిసైన యువకులను, మైనర్లను పోలీసులు జల్లెడ వేసి పట్టుకున్నారు. ఈ ఘటనలు బట్టి చూస్తే జిల్లాలో అధిక సంఖ్యలో యువత గంజాయికి బానిసలుగా మారారన్నది తేటతెల్లమవుతోంది.



బొలెరోలోని గంజాయి బస్తాలను పరిశీలిస్తున్న మెళియాపుట్టి పోలీసులు (ఫైల్)

ఒక్క ఏడాదిలో 39 కేసులు..

ఈ ఏడాది సుమారు 39 గంజాయి కేసుల్లో 113 మంది అరెస్టయ్యారు. 1137 కిలోలకు పైగా గంజాయి పట్టుబడింది. గత రెండు నెలలుగా చూస్తే 20కు పైగా కేసుల్లో సుమారు 880 కిలోలు అక్రమ రవాణాలో దొరికింది. ఇక పోలీసుల కన్నుగప్పి దాటినది ఎంతుంటుందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఒడిశా గార బంద నుంచి పలాస హైవేపైకి వచ్చిన ఓ కంటైనర్ లారీలో భారీస్థాయిలో గంజాయి తరలిస్తున్న సమాచారం మేరకు వేకువజామున అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఢీకొట్టి వెళ్లిపోయారు. విశాఖలో ఆ లారీ పట్టుబడింది. ఇటీవల ఒడిశా నుంచి పాతపట్నం జాడుపల్లి మీదుగా భారీగా గంజాయి తరలిస్తూ పోలీసులకు కనిపించడంతో ఓ యువకున్ని ఢీకొట్టి గంజాయి ఉన్న బొలెరోను వదిలి ఒడిశా ముఠా పరారైన సంగతి తెలిసిందే.

యువత బలవ్వాల్సిందేనా..?

జిల్లాలో గంజాయి సాగు సంగతి పక్కన పెడితే.. పక్క రాష్ట్రం ఒడిశా నుంచి రెండు ప్రధాన చెక్‌పోస్టులు(పురుషోత్తపురం, పాతపట్నం) దాటి అక్రమంగా రవాణా అవుతోంది. దీంతో యువత బానిసలుగా మారుతున్నారు. సకాలంలో గంజాయి ప్యాకెట్లు దొరక్కపోతే టైర్లకు అంటించే గమ్‌ను కవర్లలో పెట్టి గంజాయిలా పీల్చే స్థితికి దిగజారిపోయారు. ఈ క్రమంలోనే నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొందరు ఒడిశా వ్యాపారులు ఇచ్చే కమీషన్ కోసం అదే గంజాయి సరఫరా చేయడం, క్రయ విక్రయాల్లో పాల్గొనడం చేస్తూ బంగారు భవితను నాశనం చేసుకుంటున్నారు.

దాడులు జరుపుతున్నా..

పోలీసులు విస్తృతంగా దాడులు జరుపుతున్నా గంజాయి జిల్లాలోకి రాకుండా మాత్రం అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. డ్రోన్ సర్వేలు, కెనైన్ డాగ్స్ పరిశీలన చేయడంతో పాటు తరచూ యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తే కొంత ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒడిశా కేంద్రంగా..

తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్(సూరత్).. తరలించే ప్రాంతమేదైనా ఒడిశానే కేంద్రం. సరిహద్దు చెక్‌పోస్టులు దాటి సిక్కోలు హైవేనే మార్గం. క్రయ విక్రయాలు జరిపేవారు, సేవించేవారు మన జిల్లావారే పట్టుబడుతున్నా 'సరుకు' అందించే మూలాలన్నీ ఒడిశావే. మన పోలీసుల రికార్డుల్లో 56 మంది పరారీలో ఉన్నట్లు తెలిసిందే. వీరిలో పదిమందిని ఇటీవల పట్టుకున్నారు. మిగిలిన 46 మంది ఒడిశా (అధికంగా), మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు తదితర ఇతర రాష్ట్ర ముఠాలకు చెందిన వారే.

వైకల్యాన్ని ఎదిరించి.. విజయాన్ని సాధించి..

- ఉత్సాహంగా విభిన్న ప్రతిభావంతుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి హాజరైన బాలబాలికలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పట్టుదల, ప్రోత్సాహం ఉంటే వైకల్యం అడ్డుకాదనే విషయాన్ని ఎంతోమంది నిరూపించారని, అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతులు రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. డిసెంబరు 3న జరగనున్న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను శ్రీకాకుళంలోని ఆర్‌అండ్‌బీ (డచ్) భవనం వద్ద బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకల్యంతో బాధపడకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ నవంబరు 1 నుంచి 30 వరకు అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి రమణ మాట్లాడుతూ చట్టబద్ధమైన పిల్లల దత్తతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత మాట్లాడుతూ డిసెంబరు 3న నిర్వహించనున్న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నాడు విజేతలకు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. అనంతరం నడక, షాట్‌పుట్, డిస్కస్ త్రో, చెస్, పాటల పోటీలు, కేరమ్స్, క్రికెట్, జావెలెన్ త్రో, ట్రై సైకిళ్లు తదితర పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డ్వామా పీడీ సుధాకర్, సీపీఓ లక్ష్మీప్రసన్న, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, నైపుణ్యాభివద్ధి అధికారి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సహాయకురాలితో కలిసి పరుగు పందెంలో పాల్గొన్న అంధ బాలిక



విభిన్న ప్రతిభావంతుల పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ వెంకటేశ్వరరావు



ట్రై సైకిల్ పోటీ



బధిర బాలికల పరుగు

క్లుప్తంగా

స్పెషల్ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లకు ఏడు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ బీఎడ్ (మెంటల్లీ రిటార్డ్)లో ఎడ్‌సెట్ -2024 కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఏడు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించగా ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. అర్హత పరిశీలించి ప్రవేశాలు కల్పించనున్నట్లు కోర్సు కో–ఆర్డినేటర్ స్వామినాయుడు బుధవారం తెలిపారు.

22న బొల్లినేని మెడిస్కిల్స్‌లో జాబ్‌మేళా

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి, బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన 18 నుంచి 20 ఏళ్లలోపు విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,500 వేతనం అందుతుందని, అనకాపల్లి జిల్లా పరవాడలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరి



మల్లాది సోదరులను సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: కచ్ఛపి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నగరంలోని బాపూజీ కళామందిర్‌లో బుధవారం నిర్వహించిన గాత్ర కచేరి ఆద్యంతం అలరించింది. మృదంగ రత్నాకర వి.కమలాకరరావు, శ్రీపాద పినాకపాణిలను స్మరించుకుంటు మల్లాది సోదరులు శ్రీరాం ప్రసాద్, రవికుమార్‌లు పలు కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీరామచంద్రమూర్తి, ఇప్పిలి శంకర శర్మ, పులఖండం శ్రీనివాసరావు, పి.జగన్మోహనరావు, బగ్గామ్ ధనుంజయ్ పట్నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగి వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

బూర్జ: మండలంలోని సింగన్నపాలేం గ్రామానికి చెందిన పాగిరి అప్పలనాయుడు (48) పురుగు మందు తాగి మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు అప్పలనాయుడు సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన సొంత వ్యవసాయ పొలం నిమిత్తం తెచ్చిన పురుగు మందును మద్యం అనుకొని తాగేశాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను ఆరా తీయగా పురుగు మందు సేవించినట్లు తెలపడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనం సాయంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడు తల్లి పాగిరి అప్పలనర్సమ్మ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య వనజాక్షి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం, మృతదేహానికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అబ్బే అంతా తూచ్..!

వేట లేదు.. భృతి అందలేదు




- మత్స్యకారులకు కూటమి సర్కార్ మొండిచేయి
- ఇంకా అందని వేట నిషేధ భృతి
- రీసర్వే పేరిట కప్పదాట్లు
- రూ.20 వేలకు పెంచుతామన్న మాట గాలికి
- నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

అరసవల్లి:

సముద్రపు వేట ఆధారిత గంగపుత్రులకు దక్కాల్సిన వేట నిషేధ భృతిపై కూడా కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. ప్రతీఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి జూన్ 14 వరకు నిబంధనల మేరకు అమలవుతున్న నిషేధ సమయం పూర్తయ్యి ఆరు నెలలు గడుస్తున్నా భృతి మాట ఎత్తడం లేదు. గత ప్రభుత్వంలో వరుసగా ఐదేళ్లు పాటు ఒక్కో మత్స్యకారుడికి ఏటా రూ.10 వేల చొప్పున భృతిని అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే, తాము అధికారంలోకి వస్తే ఆ భృతిని రూ.20 వేలకు పెంచి ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఆ హామీ నుంచి ఎలాగైనా తప్పించుకునేలా కప్పదాట్లు, కుంటి సాకులు వెదుకుతోంది. ఈక్రమంలో అర్హుల జాబితాను గుర్తించేందుకు మరోసారి సర్వే చేయాలని నిర్ణయించింది. ఇదే సాకుతో గత ఆరునెలల నుంచి భృతి ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతోంది. తాజాగా ఈ భృతిని ఈనెల 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా చెల్లించలేమంటూ ఏకంగా శాసనసభలో సంబంధిత మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటనతో మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇక భృతి వచ్చే ఆశలు నీరు గార్చారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు.. నేడు



సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఉపాధి కోసం భృతిని ప్రభుత్వాలు అందజేస్తున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్న 2014 నుంచి 2019 వరకు ఒక్కొక్కరికీ రూ.4 వేల చొప్పున భృతిని చెల్లించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నుంచి ఐదు విడతల్లో ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ఏకంగా రూ.70 కోట్లకు పైగా భృతిని అందజేసి సంక్షేమ పాలను అందజేసింది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ భృతిని రూ.20 వేలకు పెంచుతూ అందజేస్తామని ఎన్నికల సమయంలో ప్రకటించింది. అయితే ఇప్పటికే సమయం దాటినా ఇంకా అందించకుండా కుంటిసాకులు చెబుతోంది. ఇదిలావుంటే తాజా సర్వే అనంతర సమాచారం ప్రకారం 15,200 మందికి రూ.20 వేల చొప్పున ఈ ఒక్క జిల్లాలోనే మొత్తం రూ.30.40 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. దీనిపై జిల్లాలో మత్స్యకారులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ సంఖ్యను రీసర్వే పేరిట కుదించేలా కూటమి సర్కార్ కుట్రలు చేస్తోందని తెలుస్తోంది.

గత ప్రభుత్వం అందజేసిన భృతి

ఏడాది	లబ్ధిదారులు	భృతి జమ
2019-20	13,388	రూ.13.38 కోట్లు
2020-21	14,289	రూ.14.28 కోట్లు
2021-22	13,612	రూ.13.61 కోట్లు
2022-23	14,043	రూ.14.04 కోట్లు
2023-24	15,281	రూ.15.28 కోట్లు

3 వేల మందికి ఎసరు..?

జిల్లాలో 11 మండలాల పరిధిలో తీరప్రాంత మత్స్యకారులు వేటపై జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రతిఏటా 15వేలకు పైగా మత్స్యకారులు వేట నిషేధ కాలంలో ఇంటికే పరిమితమయ్యేవారు.

రీసర్వే అనంతరం అందజేత



వేట నిషేధ భృతిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రత్యేక కార్యక్రమం ద్వారా అందజేయనుంది. అయితే అర్హుల జాబితాలో అనర్హుల ఏరివేత కోసం 6 స్టెప్స్ వెరిఫికేషన్‌ను చేపడుతోంది. ఈ రీసర్వే అనంతరం అర్హులందరికీ భృతిని అందజేస్తారు. ఇప్పటికే సుమారుగా 12,340 మంది అర్హులుగా గుర్తించి నివేదించాం.

– పీవీ శ్రీనివాసరావు, డీడీ, మత్స్యశాఖ

నిరసన తప్పదు



మత్స్యకారులపై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. వేట నిషేధం పూర్తయ్యి ఆరు నెలలు దాటిపోయినా.. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. పైగా ఇప్పుడు అర్హుల గుర్తింపు కోసం రీసర్వే చేయాలంటూ తప్పించుకుంటోంది. ఈ పరిహారాన్ని రూ.20 వేలుకు పెంచి ఇస్తామన్నారు. ఈనెలాఖరు నాటికి అర్హులందరికీ భృతి చెల్లించకపోతే.. జిల్లా కేంద్రంలో భారీగా నిరసనలు చేపడతాం.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు

ఈక్రమంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్ష సర్వే ద్వారా అర్హులను గుర్తించి వారికి పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారా అందజేయాల్సి ఉంది. ఇందుకోసం మత్స్యశాఖ అధికారులు సర్వేను చేపట్టి 15,200 మంది అర్హులుగా గుర్తించారు. అయితే కూటమి ప్రభుత్వం దీనిపై మళ్లీ సర్వే చేసేలా చర్యలకు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీంతో ఇప్పుడా సంఖ్య 12,340 మందికి మాత్రమే పరిమితం కానుందని సమాచారం. సిక్స్ స్టెప్స్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా చాలామందిని అర్హత నుంచి తప్పించినట్లుగా ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఈసారి సుమారు మూడు వేల మందికి ఈ భృతి దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. ఇంకా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కుట్రలతో ఆ మూడు వేల మందికి ఎసరు పెట్టినట్లైంది.

జూడో పోటీలకు వర్సిటీ క్రీడాకారిణులు



క్రీడాకారిణులను అభినందిస్తున్న వీసీ రజని, రిజిస్ట్రార్ సుజాత

ఎచ్చెర్ల క్యాంపస్: మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ విశ్వ విద్యాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సౌత్ వెస్ట్ అంతర విశ్వ విద్యాలయాల జూడో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరుపున క్రీడాకారిణులు సీహెచ్ సాయికుమారి (శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల), వి.కావ్య (శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల) పాల్గొంటున్నారు. వీరిని వర్సిటీలో ప్రత్యేకంగా వీసీ రజిని, రిజిస్ట్రార్ సుజాత బుధవారం అభినందించారు. క్రీడల్లో సత్తా చూపి వర్సిటీకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు పిల్లలవలస విద్యార్థి



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ పోలినాయుడు తదితరులు

పొందూరు: మండలంలోని పిల్లలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గురుగుబెల్లి సోమశేఖర్ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 25వ తేదీ నుంచి 29 వరకు ఛత్తీస్‌గఢ్‌లోని మాష్కండ్‌లో 68వ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ జరగనున్నాయి. ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో సోమశేఖర్ పాల్గొనున్నాడు. దీంతో విద్యార్థికి అవసరమైన ఖర్చుల కోసం సర్పంచ్ బి.పోలినాయుడు, ఉప సర్పంచ్ జి.కృష్ణమూర్తి ఆర్థిక సాయం అందించారు. విద్యార్థికి హెచ్ఎం కాసులబాబు, పీడీ జి.రాజశేఖర్‌రావు, ఉపాధ్యాయులు, ప్రజలు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు తాడివలస విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం కంటయ్య

పొందూరు: ఈనెల 22వ తేదీ నుంచి 23 వరకు రెండు రోజులు పాటు జరగనున్న అండర్–14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తాడివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం బల్ల కంటయ్య బుధవారం తెలిపారు. వాకముల్లు నిత్యశ్రీ, తొగరాపు భార్గవి, సుందరాపల్లి విజయరాజులు ఎంపికయ్యారని చెప్పారు. సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఎంపీటీసీ సువ్వారి దివ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ మురళీధర్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాజ్‌కోట్ వేదికగా జరగనున్న జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు దీక్షా బెహర, పైడి హర్షిత ఎంపికైనట్టు డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ డి.మురళీధర్ బుధవారం తెలిపారు. ఇటీవల నరసారావుపేటలో జరిగిన రాష్ట్రపోటీల్లో వీరిద్దరూ పతకాలతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు.

బెంతొరియాల సమస్యలు పరిష్కరించండి

- శాసన మండలిలో ఎమ్మెల్సీ నర్తు రామారావు



మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లో ఉంటున్న 25 వేల మంది బెంతొరియా సామాజిక వర్గానికి చెందిన ప్రజల సమస్యలను పరిష్కరించాలని శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి సభ్యుడు నర్తు రామారావు కోరారు. శాసన మండలి బడ్జెట్ సమావేశాల్లో స్పెషల్ మెన్షన్ అవర్‌లో ఈ అంశాన్ని బుధవారం ఆయన ప్రస్తావించారు. బ్రిటిష్ కాలం నుంచి ఎస్టీలుగా గుర్తింపు పొందిన బెంతొరియాలు ప్రస్తుతం సామాజికవర్గ సమస్యతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వీరంతా ఏ కులానికి చెందినవారో, ఏ ప్రాంతానికి చెందినవారో అనేది గుర్తింపు లేకపోవడం బాధాకరమన్నారు. 1973 నుంచి 76 వరకు, 1981 నుంచి 88 వరకు, 1999 నుంచి 2003 వరకు ఆయా ప్రభుత్వాలు బెంతొరియాలను ఎస్టీలుగా గుర్తించాయని, ఆ సర్టిఫికెట్లతో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో కొలువుదీరారని తెలిపారు. కానీ ప్రస్తుతం బెంతొరియాలకు సర్టిఫికెట్లు మంజూరు చేయడం లేదని, దీంతో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని చాలా మంది విద్యార్థులు తమ ఉన్నత చదువులకు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. సుమారు పాతిక వేల మంది సమస్యకు పరిష్కారమయ్యే మార్గాన్ని ఈ చట్టసభ ద్వారా చూపించాలని విన్నవించారు. 380 రోజులుగా బెంతొరియా పౌరులు కవిటి మండల కేంద్రంలో రిలే దీక్షలు చేస్తున్నారని తెలిపారు.

మర్యాదపూర్వక భేటీ

మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలను చర్చించారు.

– టెక్కలి



రెడ్డిక సంఘాన్ని బలోపేతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘ నాయకులు

ఇచ్ఛాపురం/రూరల్: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న రెడ్డిక సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేద్దామని రెడ్డిక సంఘం తీర్మానించింది. బుధవారం ఇచ్ఛాపురంలో శ్రీకాకుళం–పూరీ–గంజాం జిల్లాల రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ఉభయ రాష్ట్రాల రెడ్డిక సంఘం ఏర్పాటు చేసి 2025కు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వచ్చే ఏడాది మేలో సంఘ చరిత్ర, ఐక్యత, కట్టుబాట్లు ఉట్టిపడేటట్లు వేడుకలను నిర్వహించేందుకు సంఘ ప్రతినిధులు ఆమోదించారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ పైలా దేవదాసు రెడ్డి, మాజీ ఎంపీపీలు కారంగి మోహనరావు, దక్కత ఢిల్లీరావు, చాట్ల తులసీదాసురెడ్డి, ఆశి చిరంజీవులు, ఉప్పాడ రాజారెడ్డి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, బుడ్డేపు కామేష్‌రెడ్డి, పిలక యాదవరెడ్డి, నియోజకవర్గ రెడ్డిక కుల పెద్దలు పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాట



కర్రతో దాడి చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామంలో ఆస్తి విషయమై బుధవారం ఇరువర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. ఇదే మండలంలోని బెండి గ్రామానికి చెందిన రెల్ల హేమలత బుధవారం కొమరల్తాడ పొలంలో వరి కోత కోస్తున్న దూగాన సాంబమూర్తి, దూగాన తానేశ్వరరావులను అడ్డుకుంది. దీంతో ఇరువురూ హేమలతపై దాడి చేశారు. ఈ ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందిన వారే. వివాహాలు అనంతరం తల్లిదండ్రులు కుమార్తె వద్ద ఉండటం, ఆలనాపాలనా చూడటంతో తండ్రి తన భూమిని కుమార్తె హేమలతకు రాసిచ్చారు. ఇందుకు అన్నదమ్ములు అంగీకరించలేదు. ఈ క్రమంలోనే వరికోతలు ప్రారంభించడంతో అడ్డుకోవడానికి వచ్చిన చెల్లితో అన్నదమ్ములు వాగ్వాదానికి దిగారు. అనంతరం దాడులు చేసుకున్నారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం



మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాసరావు

నరసన్నపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సిబ్బంది సన్నద్ధం కావాలని సివిల్ సప్లయ్ డీఎం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల సిబ్బంది, రైతు సేవా కేంద్రాల వీపీఏలు, వీఆర్వోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో 17 శాతం పైబడి తేమ శాతం ఉండకూడదన్నారు. వాహనానికి జీపీఎస్ ఉంటేనే మిల్లుకు తరలించాలన్నారు. గోనె సంచులు, కలాశీల ఖర్చులు రైతుల ఖతాలకే జమ చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ బి.మధుసూదనరావు, వ్యవసాయాధికారి కె.సునీత, సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

బంగారం చోరీపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట గ్రామానికి చెందిన పైడి అనసూయ ఫిర్యాదు మేరకు పోలీసులు బంగారం చోరీపై బుధవారం కేసు నమోదు చేశారు. టైలరింగ్‌లో గత కొంతకాలంగా అనసూయ శిక్షణ ఇస్తోంది. కొందరు మహిళలు శిక్షణ నిమిత్తం ఇంటికి వచ్చి నేర్చుకుంటున్నారు. అయితే కట్టుపని నేర్చుకుంటున్న వారిని విడిచిపెట్టి బయటకు వెళ్లి, తిరిగి ఇంటికి వచ్చి రాత్రి సమయంలో చూడగా బీరువాలో బంగారం ఆరు తులాలు పోయినట్లు గుర్తించింది. బీరువా తాళాలు సైతం పైన పెట్టటంతో తేలిగ్గా చోరీ జరిగింది. శిక్షణ తీసుకుంటున్న వారిలో కొందరిని అనుమానిస్తూ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. సంఘటన అక్టోబర్ 15న జరిగింది. స్థానికంగా సమస్య పరిష్కారం అవుతుందని ఎదురుచూసిన బాధితురాలు చివరకు పోలీసులను సంప్రదించింది. విచారణ ప్రారంభించినట్లు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు.

ఆర్చరీ పోటీల్లో కల్యాణ్‌కు కాంస్యం



కల్యాణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన ఎ.కల్యాణ్ కాంస్య పతకం సాధించి శభాష్ అనిపించాడు. శ్రీకాకుళం నగరానికి చెందిన ఈ యువ క్రీడాకారుడు గుజరాత్‌లో జరిగిన అండర్–14 విభాగం ఆర్చరీ రీకవరీలో మూడో స్థానంలో నిలిచి రాష్ట్రానికి, జిల్లాకు పతకాన్ని అందించాడు. జిల్లా ఎస్‌జీఎఫ్ అధికారులు, పీడీలు హర్షం వ్యక్తం చేశారు.

కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు

- 108 శివలింగాలకు రుద్రాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎస్ఎన్ఎంహెచ్ స్కూల్ వెనుకనున్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈనెల 25వ తేదీన కార్తీక నాల్గో సోమవారం పురస్కరించుకొని కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. దీనికోసం పుణ్యపు వీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువర్చలా అభయాంజనేయస్వామి ఆలయం ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో 10 వేల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు అంచనా.

108 శివలింగాలకు అభిషేకాలు

కార్యక్రమంలో భాగంగా 108 శివలింగాలకు 108 మంది దంపతులచే సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేయిస్తారు. దీనికోసం వేదిక ఏర్పాటు చేసి 108 శివలింగాలను ఏర్పాటు చేస్తున్నారు. అభిషేక సామగ్రిని నిర్వాహకులు అందజేస్తారు.

ఉచితంగానే...



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కోటి దీపోత్సవంలో పాల్గొనేవారికి ఎటువంటి ప్రవేశ రుసుము తీసుకోవడం లేదు. అక్కడికి హాజరయ్యేవారికి వత్తి, ప్రమిద, నూనెను వారే సరఫరా చేస్తున్నారు. దీనికోసం 365 కట్టల వత్తులను, 30 వేల ప్రమిదలను సిద్ధం చేశారు. దీపాల మధ్య 5 అడుగుల దూరం ఏర్పాటు చేశారు.

బారికేడ్లు ఏర్పాటు

ఈ ఉత్సవానికి హాజరయ్యే భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దీపారాధన గ్యాలరీ, వీవీఐపీ గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల మధ్య దూరం ఏర్పాటు చేసి దీపాల ప్రమిదలు పెట్టుకునేందుకు పచ్చి ఇటుకలను సిద్ధం చేస్తున్నారు. 10 వేల మంది కూర్చునేవిధంగా బారికేడ్లు, టార్పాలిన్లు తీసుకొచ్చారు. హాజరయ్యే వీవీఐపీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 300 కుర్చీలు సిద్ధం చేశారు.

అందరికీ మంచి జరగాలి



ఈశ్వరుని దయ అందరిపై ఉండాలని, అందరికీ మంచి జరగాలని ఈ ఉత్సవం నిర్వహిస్తున్నాం. కోటి దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు ఉచితంగా సామగ్రి అందిస్తున్నాం. రుద్రాభిషేకాలకు సామాగ్రిని మేమే ఏర్పాటు చేస్తున్నాం.

– ముక్కాల కొండబాబు, ఆలయ ధర్మకర్త